వేదాంతభేరి

సెప్టెంబర్ 2020

రూ. 10/-

వేదాంతభేరి

సెప్టెంబర్ 2020

రూ. 10/-

దేహబుద్ధ్యాతు దాసోఽహం జీవబుద్ధ్యా త్వదంశకః
ఆత్మాబుద్ధ్యా త్వమేవాహం ఇతి మే నిశ్చితామతిః.

శ్రీ రాముడు అంజనేయునకు ఆధ్యాత్మిక విషయము లన్నిటిని బోధించి తుట్టతుదకు నీవేమి గ్రహించితివని అడుగగా అంజనేయుడు చెప్పిన ప్రత్యుత్తరమిది- నేను దేహమని ఎప్పుడైన తలంచినచో అపుడు మీ దాసానుదాసు డను. నేను జీవుడనని తలంచినచో మీ యొక్క ఒకానొక అంశమును. నేను ఆత్మను అని తలంచినచో అపుడు మీరే నేను- అని నా బుద్ధి నిశ్చయించినది.

మతము ద్వైత, విశిష్టాద్వైత,అద్వైత రూపములుగ మూడు విధములుగ యుండును.

1) ద్వైతమందు జీవుడు దేవునికంటె వేరుగ యుండును. అపుడు దేవునకు భక్తితో నమస్కరించుచుండును.
2) విశిష్టాద్వైతమందు తరంగము సముద్రముయొక్క ఒక అంశముగ యుండునట్లు జీవుడు దేవునియొక్క ఒకానొక అంశముగ యుండును.
3) అద్వైతమునందు జీవునకు, దేవునకు భేదమేమియు యుండదు. సాధకుడు క్రమక్రమముగ ఊర్ధ్వస్థితిని పొందుచు అహంబ్రహ్మాస్మి-అని చివరకు బ్రహ్మముగనే పరిణమించును. సాధ్యము ప్రయత్నాతిశయముచే ఒక్కొక్క మెట్టు పైకిపోయి తుట్టతుదకు సాక్షాత్ పర బ్రహ్మమునందు విలీనమైపోవలెను.

- శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారు

ॐ వేదాంతభేరి ॐ

సంస్థాపకులు: శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 53 సెప్టెంబర్ 2020 సంచిక : 09

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు
విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ వేదాంతభేరి ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 53 సెప్టెంబర్ 2020 సంచిక : 09

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. వాయిదాలు వేయబోకు -శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు- 06
03. ధారణ - ధ్యానములు - శ్రీ శివానంద స్వాములవారు - 12
04. సాధన పంచకమ్ - శ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు - 17
05. అర్థ మనర్థం - శ్రీసర్వాత్మానందగిరిస్వాములవారు -20
06. భయంకర సూక్ష్మజీవులు- డా॥ సముద్రాల లక్ష్మణయ్య -25
07. గృహస్థాశ్రమము - ఎ. తారాలక్ష్మి - 30
08. కరోనాకు నివారణోపాయం - ఆచార్య కె. సర్వోత్తమరావు - 33
09. ఉద్ధవగీత- శ్రీ యేలేశ్వరపు హనుమరామకృష్ణ - 35
10. వేదాన్తసారము - 41
11. వార్తలు - 42

ముఖచిత్రం

పరమ పూజ్య శ్రీశ్రీ శివానందసరస్వతి స్వాములవారు (హృషీకేశ్)

01-09-2020 మంగళవారం, అనంతపద్మనాభవ్రతం

2-09-2020 ఉమామహేశ్వర వ్రతం

8-09-2020 పూజ్యశ్రీ శివానందస్వామి జన్మదినం

16-09-2020 మాస శివరాత్రి

17-09-2020 మహాలయ అమావాస్య

18-092020 అధిక ఆశ్వయుజమాసం ప్రారంభం

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

(బ్రహ్మదేవుడు)

1. ఓం పద్మగర్భ విశాలాక్ష జయ లోకేశ్వరేశ్వర ।
భూత భవ్య భవన్నాథ జయ సౌమ్యాత్మజాత్మజ ॥

2. ఓం అసంఖ్యేయ గుణాధార జయ సర్వపరాయణ ।
నారాయణ! సుదుష్పార జయ శార్‌ఙ్గధనుర్ధర ॥

3. ఓం జయ విశ్వమహాదేవ జయ లోకహితే రతః ।
జయ యోగేశ్వర విభో జయయోగపరావర ॥

4. ఓం జయ సర్వగుణోపేత విశ్వమూర్తే నిరామయ ।
విశ్వేశ్వర మహాబాహూ జయ లోకార్థ తత్పర ॥

5. ఓం మహోరగవరాహాద్యా హరికేశవిభో జయ ।
హరివాస దిశామీశ విశ్వవాసా మితావ్యయ ॥

6. ఓం వ్యక్తావ్యక్తామితస్థాన నితాతేన్ద్రియ సత్క్రియ ।
అసంఖ్యేయాత్మ భావజ్ఞ జయ గమ్భీర కామద ॥

7. ఓం గుహ్యాత్మన్ సర్వయోగాత్మ స్ఫుటం సమ్భూత సమ్భవ ।
భూతాద్య లోకతత్త్వేశ జయ భూతవిభావన ॥

8. ఓం ఆత్మయోనే మహాభాగ కల్పసంక్షేమతత్పర ।
ఉద్భావనమనోభావ జయబ్రహ్మ జనప్రియ ॥

9. ఓం ప్రజాపతిపతే ! దేవ! పద్మనాభ ! మహాబల ।
ఆత్మభూత మహాభూత సత్త్వాత్మన్ జయ సర్వదా ॥

10. ఓం పద్మనాభ! విశాలాక్ష ! కృష్ణ! దుఃఖప్రణాశన ।
త్వం గతిః సర్వభూతానాం త్వం నేతా త్వం జగద్గురు ।
త్వత్ప్రసాదేన దేవేశ సుఖినో విబుధాః సదా ॥

వాయిదాలు వేయబోకు

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

అతి సూక్ష్మరూపుడును, నిర్మలుడును, విశ్వాధారుడునునగు పరమాత్మను తన హృదయమందు క్షణకాలమైనను ధ్యానించని వాని జీవితము నిరర్థకమే యగునని పూర్వము శుకులవారు ఆనతిచ్చి యుండిరి. ప్రాపంచిక భోగవిలాసములందు నిమగ్నుడుకాని మనుజుని జీవితము వ్యర్థమని రంభ పలుకగా, ఆమె వాక్యములను ధిక్కరించి శుకులు పైవిధముగా పలికిరి. శుకుని వాక్యములు పరమసత్యములు. రంభ పలుకులు అజ్ఞాని భావమునే ప్రతిబింబింపజేయుచున్నవి. శుకుల వాక్యములు శాస్త్ర సమ్మతములై జ్ఞానియొక్క భావమునే వ్యక్తమొనర్చు చున్నవి. అజ్ఞాని మాయకు లోబడియున్నందున దృశ్య పదార్థములనే సత్యమని నమ్మి, విషయానందమునే తన జీవితలక్ష్యముగ నొనర్చుకొనుచున్నాడు. బాగుగ విచారించి చూచినచో ఆ విషయము లందలి సుఖము కేవలము మనః కల్పితముగనే తేలుచున్నది.

"రోగ శాంతికరకృత్యము భోగమనంగ జెల్లునే"

అని భర్తృహరి ప్రశ్నించుట చాల సమంజసముగనే యున్నది. ఆకలి దప్పిక మొదలగు వ్యాధులకు భోజనపానాది ప్రతీకార చర్యల నొనర్చుచు అట్టి వ్యాధిప్రతీకార చర్యనే సుఖమని తలంచి మానవుడు భ్రమించుచున్నాడు. వాస్తవముగ అది సుఖము కాదు. సుఖాభాసమే. సుఖము భగవంతుని పాదపద్మములను సేవించుటయందే కలదు. హృదయమందు, సమస్త చరాచరములందు వెలుగొందుచున్న పరమాత్మను భజించుటయందే కలదు. అట్లు భజించువాడు, "సుఖమక్షయమశ్నుతే" అనునట్లు అనంత సుఖమును బడయుచున్నాడు. కనుకనే శాస్త్రములు, అనుభవజ్ఞులగు మహనీయులు...

'ప్రాప్య వరాన్ నిబోధత!' "మహాత్ముల కడకేగి ఆత్మవిజ్ఞానమును శీఘ్రముగ బడయుడు" అని ముక్తకంఠముతో పలుకుచున్నారు. కావున ఇట్టి వేదాంత గర్జనము నాలకించి తమస్సును పారద్రోలి ముకుంద పాదపద్మములను శీఘ్రాతి శీఘ్రముగ నాశ్రయించవలెను. అజ్ఞానకుహరము నుండి వినిర్గతులై ఆత్మ ప్రకాశమును సత్వరమే అనుభూత మొనర్చుకొనవలెను. ఏ మాత్రము జాగుచేయరాదు.

విశ్వమందు యెనుబది నాలుగు లక్షల రకముల జీవరాసులున్నప్పటి కిని మోక్షప్రాప్తికి వలయు సాధనములను చక్కగ ఆచరించుటకు అనువైన జన్మ మానవ జన్మయే అయియున్నది. ఇది సర్వోత్కృష్టమైనది. మహాదుర్లభ మైనది. బహుజన్మార్జిత సుకృతము వలననే ఇది లభించును. అధిక పుణ్యమను మూల్యమును చెల్లించిన జీవునకు బ్రహ్మసాక్షాత్కారయోగ్యమగు మానవ జన్మము లభించుచున్నది.

సంసారమను మహాసముద్రమును దాటుటకు ఈ మానవ దేహమను నావ ఎంతయో అవసరమైయున్నది. తక్కిన క్రిమికీటకాది జీవరాసులన్నియు ఇట్టి ప్రజ్ఞాయుతమగు ఉపాధిలేక నానాబాధలుపడుచు,జ్ఞానమును తద్ద్వారా మోక్షమును బడయజాలక దుఃఖించుచు ఈ జనన మరణరూప చక్రమునందు తిరుగాడుచున్నవి. కావున సుదుర్లభమగు మానవ శరీరమును పొందికూడ ఎవడు మోక్షమను గమ్యమును చేరుటకై యత్నశీలుడు కాకుండునో అట్టివాడు తన్నుతాను అధోగతికి త్రోసికొనువాడే యగును.

కాని అమూల్యమగు మానవ జన్మము పొందియు పలువురు అట్టి మహోన్నత లక్ష్యమును విస్మరించి జీవితమును వ్యర్థముగ గడిపివేయుచున్నారు.

బాలస్తావత్క్రీడా సక్తః, తరుణస్తావత్తరుణీ సక్తః ।

వృద్ధస్తావచ్చింతాసక్తః, పరే బ్రహ్మణి కోఽపి న సక్తః ॥

అని శ్రీ శంకరాచార్యులవారు తెలిపినట్లు అజ్ఞానులగువారు బాల్యకాలమును క్రీడాదులలోను, యౌవనకాలమును విషయాదులందును, వార్ధక్యమును సాంసారిక చింతయందును గడిపివేసి పరబ్రహ్మమును గూర్చి లేశమైనను చింతన చేయకున్నారు. అందు అమూల్యమైన మానవ జీవితము వ్యర్థమైపోవుచున్నది.

ప్రతి జీవికిని మోక్ష ప్రాప్తియే చరమలక్ష్యమై యున్నది. మోక్షమనగా విడుదల. బంధము నుండి విడుదల, దుఃఖభూయిష్టమగు సంసార బంధమునుండి విముక్తినొందుటయే మోక్షము. పుట్టుక, చావు నుండి తప్పించుకొనుటయే మోక్షము. అవిచ్ఛిన్నమగు ఆత్మానందానుభూతిని బడయుట, స్వరూపమగు దైవమందు నిలుకడ కలిగియుండుట, దేహభావమును, మనోభావమును వదిలించుకొని ఆత్మయందు సుస్థితుడై యుండుట అను మహోన్నత స్థితియే మోక్షమని చెప్పబడును.

అట్టి పరమానందదాయకమగు మోక్షస్థితికై యత్నింపక జీవుడు బంధనమునందు తగుల్కొని అజ్ఞాన శృంఖములచే బద్ధుడై, తాను దేహమని భ్రమించుచు జననమరణ సంసారచక్రమందు తగుల్కొని పరిభ్రమించు చున్నాడు. నరుడు మంత్రమయుడుకాదు,మృణ్మయుడు కాదు, చిన్మయుడు. పోతపోసిన సచ్చిదానంద విగ్రహుడే మానవుడు. ఈ సత్యమును ఉపనిషత్తులు పదేపదే వాక్రుచ్చుచున్నవి. కాని అజ్ఞానియగు జీవుడు శ్రుతిభగవతి యొక్క ఆ మహత్త్వపూర్ణ వాక్యములను సరకుగొనక దృశ్య వైభవములే తన జీవిత లక్ష్యమని భావించి, పాంచభౌతికమైన అల్పకాయమే తానని యెంచి, సత్య వస్తువును విస్మరించి అసత్య వస్తువుల వెంట పరుగిడుచు సంసారమను ఊబిలో దిగబడిపోవుచున్నాడు. ఇది చాల

శోచనీయమైన విషయము. అట్లు కావింపక, విజ్ఞతతో కూడినవాడై జీవుడు తన జీవిత లక్ష్యమును గూర్చి లెస్సగ సమాలోచించుకొని కడతేరు మార్గమును త్వరితముగ యోచించుకొనవలెను. ఏలయనిన జీవితము క్షణికమైనది. శరీరము స్వస్థముగ నున్నపుడే ఆత్మసాక్షాత్కారమును జీవిత లక్ష్యమును కార్యాన్విత మొనర్చవలెను.

బాగుగ విచారించి చూచినచో జీవునకు దుఃఖమనునది స్వభావ సిద్ధమైనది కాదనియు, ఆగంతుకమైనదే యనియు తెలియగలదు. పరమానందమయుడగు జీవుడు తన నిజస్వరూపమగు ఆత్మను విస్మరించి నందు వలననే జడమగు దేహము తానని భావించుటవలననే ఈ బంధము, ఈ సంసారజంజాటము నెత్తిన వచ్చి పడినది. చీకటిలో ఒకడు త్రాడును పామని భావించి కంగారుపడి నానాబాధలు పొందుచున్నాడు. ఆ బాధ లన్నియు దీపమును తెచ్చి చూచినచో తొలగిపోవుచున్నవి. అట్లే అంధకార బంధురమైన ఘోర తమస్సునందుపడి కోట్లకొలది జన్మలు నానా యాతనలు అనుభవించుచున్న జీవుడు ఆత్మజ్ఞానమను జ్యోతిని వెలిగించినపుడే పరమశాంతిని, దుఃఖరాహిత్యమును పొందగలడు. అట్టి యత్నమును శీఘ్రముగ ఈ మానవజీవితమందే ఒనర్చి లక్ష్యమును సాధించివేయవలెను.

1). మోక్షధామము త్వరగ చేరన్నా

నరజన్మమిచట మాటిమాటికి రాదురోరన్నా

దుర్లభంబగు మానవత్వము

పొందియుండియు దైవకృపకై

యత్నమేమియు చేయకున్నచొ

నరకకూపము పాలుపడుదురు । తత్త్వసారము తెలిసికోరన్నా ॥

2). నరుని దేహము అరుదురోరన్నా

మానవత్వము, ఎల్లవేళల రాదురాదన్నా

ఉత్తమంబగు దేహమొంది

విషయ సౌఖ్యము దూరముంచి

సర్వసుఖముల నిలయమైన

ఆత్మ బడసి ముక్తినొందుము ॥త॥

3). క్షణికమైనది జీవితంబన్నా

పరమార్థతత్త్వము, జాగుచేయక తెలిసికోరన్నా

కాలయాపన యేమిచేయక

దేనికొఅకు భీతినొందక

గురుని చెంతను చేరి రయమున

తారకంబును తెలిసికొనుము ॥త॥

4). మానసంబున భయము వీడన్నా

జగమునందున ఆత్మకన్యము ఏదిలేదన్నా

ఆత్మయంతట వెలుగుచుండ

తాను ఎవరు ఇతరుడెవరు?

నీ స్వరూపము చూచి నీవు

భీతినొందెదవేల నరుడా ! ॥త॥

5). దేహనౌకను కొంటి వోరన్నా

విలువగలిగిన, వస్తువియ్యది తెలిసికోరన్నా

అధిక పుణ్యము నిచ్చికొనిన

దేహరూపపు నావతోను

సాగరంబును దాటివేయుము

శిథిలమైనది కాక పూర్వమె ॥త॥

6). రేపు రేపని పలుకవద్దన్నా

దైవసేవలో, **వాయిదాలు వేయబోకన్నా**

మఱుక్షణంబు ఎటులనుండునో

రోగమేదియొ ఆక్రమించునొ

ఏ పరిస్థితి యెటుల మారునొ

తలచు దేవుని వేగమిపుడే ॥త॥

మానవుని యందు ఒక అలౌకికమైన దివ్యశక్తి నిగూఢమై యున్నది. అదియే ప్రజ్ఞ. దానినే 'బ్రహ్మావలోకధిషణము' అని భాగవత కారుడు పేర్కొనెను. అనగా పరబ్రహ్మమును సాక్షాత్కారించుకొనగల అపూర్వధీశక్తి. అట్టి శక్తి సృష్టిలో ఏ ఇతర ప్రాణికిని లేదు. అట్టి జ్ఞానశక్తి మానవుడు చక్కగ వికసింపజేసికొని, ప్రయత్నపూర్వకముగ సద్వినియోగ పఱచుకొని, తద్వారా స్వస్వరూపమగు బ్రహ్మమును సాక్షాత్కరించుకొని ధన్యుడు కావలెను. అపుడే మానవత్వము సార్థకము కాగలదు. మా=అజ్ఞానమును, న=లేకుండ, వ= వర్తించువాడు మానవుడు. మాధవత్వమే మానవుని లక్ష్యము. కావున మానవుడు మాధవుడైపరగుచు, జీవుడు శివుడై విలసిల్లుచు, నరుడు నారాయణుడై యొప్పుచు జీవితమును సార్థకము చేసికొనవలెను.

2). నరుని దేహము అరుదురోరన్నా
మానవత్వము. ఎల్లవేళల రాదురాదన్నా
ఉత్తమంబగు దేహమొంది
విషయ సౌఖ్యము దూరముంచి
సర్వసుఖముల నిలయమైన
ఆత్మ బడసి ముక్తినొందుము ॥త॥

3). క్షణికమైనది జీవితంబన్నా
పరమార్థతత్త్వము, జాగుచేయక తెలిసికోరన్నా
కాలయాపన యేమిచేయక
దేనికొఅకు భీతినొందక
గురుని చెంతను చేరి రయమున
తారకంబును తెలిసికొనుము ॥త॥

4). మానసంబున భయము వీడన్నా
జగమునందున ఆత్మకన్యము ఏదిలేదన్నా
ఆత్మయంతట వెలుగుచుండ
తాను ఎవరు ఇతరుడెవరు?
నీ స్వరూపము చూచి నీవు
భీతినొందెదవేల నరుడా ! ॥త॥

5). దేహనౌకను కొంటి వోరన్నా

విలువగలిగిన, వస్తువియ్యది తెలిసికోరన్నా
అధిక పుణ్యము నిచ్చికొనిన
దేహరూపపు నావతోను
సాగరంబును దాటివేయుము
శిథిలమైనది కాక పూర్వమె ॥త॥

6). రేపు రేపని పలుకవద్దన్నా
దైవసేవలో, **వాయిదాలు వేయబోకన్నా**
మఱుక్షణంబు ఎటులనుండునో
రోగమేదియో ఆక్రమించునొ
ఏ పరిస్థితి యెటుల మారునొ
తలచు దేవుని వేగమిపుడే ॥త॥

మానవుని యందు ఒక అలౌకికమైన దివ్యశక్తి నిగూఢమై యున్నది. అదియే ప్రజ్ఞ. దానినే 'బ్రహ్మావలోకధిషణము' అని భాగవత కారుదు పేర్కొనెను. అనగా పరబ్రహ్మమును సాక్షాత్కారించుకొనగల అపూర్వధీశక్తి. అట్టి శక్తి సృష్టిలో ఏ ఇతర ప్రాణికిని లేదు. అట్టి జ్ఞానశక్తి మానవుదు చక్కగ వికసింపజేసికొని, ప్రయత్నపూర్వకముగ సద్వినియోగ పఱచుకొని, తద్వారా స్వస్వరూపమగు బ్రహ్మమును సాక్షాత్కరించుకొని ధన్యుడు కావలెను. అపుడే మానవత్వము సార్థకము కాగలదు. మా=అజ్ఞానమును, న=లేకుండ, వ= వర్తించువాడు మానవుడు. మాధవత్వమే మానవుని లక్ష్యము. కావున మానవుడు మాధవుడైపరగుచు, జీవుడు శివుడై విలసిల్లుచు, నరుడు నారాయణుడై యొప్పుచు జీవితమును సార్థకము చేసికొనవలెను.

ధారణ - ధ్యానములు

- శ్రీ శివానంద స్వాములవారు (హృషీకేశ్)

ఏదైన ఆంతరంగిక, లేక భౌతికపదార్థముపై గాని, దేవునిపై, లేక పరిపూర్ణ పరబ్రహ్మముపై గాని మనస్సును స్థిరముగా నిలుపుటయే ధారణ యనబడును.

మనస్సెల్లప్పుడు పరిభ్రమించు చుండును. అది ఎల్లప్పుడు విషయేంద్రియముల వైపు పఱుగిడుచుండును. ఎల్లప్పుడది భౌతిక విషయములను గూర్చి ఆలోచించుచుండును. అది కోతివలె ఒక్క క్షణములో ఒక విషయము నుండి మరియొక విషయము పైకి దుముకును. ఇదియే దాని స్వభావము. వైరాగ్యాభ్యాసముల ద్వారా మనస్సు నేకాగ్ర మొనర్చుటయే ధారణయని చెప్పబడును.

ధారణ ఒక రోజులోగాని, ఒక వారములోగాని, ఒక నెలలోగాని అలవడునది కాదు. అది ఉత్సాహము మఱియు విశ్వాసముతో చాలకాల మభ్యసింప బడవలయును.

బ్రహ్మచర్యము, వైరాగ్యము, లేక నిష్కామభావము లేకుండా ధారణ సల్పుట సాధ్యము కాదు. శక్తి విషయరంధ్రములలో పతితమై క్షీణింపకుండా చూడవలయును.

యమనియమములు కూడా ధారణలో జయమునొందుట కావశ్యకములు. ఆసనమునందు స్థిరముగా కూర్చుండుము. ప్రాణాయామ సాధన ద్వారా శ్వాసను నియమించి, నిలుపుము. విషయములనుండి ఇంద్రియములను మళ్లింపుము. ఇప్పుడు నీవు ధారణ మొనర్చుటకు సమర్థుడవగుదువు.

ఓ మోక్షప్రియా! నీవు ధారణయందు ప్రతిష్ఠింపబడినచో, ధ్యానసమాధులు వాటికవే నీకు సంప్రాప్తించును.

స్థూలము, సూక్ష్మమని ధారణ రెండు విధములు. అపరిచితుడు, లేక ప్రారంభకునకు ఒక రూపముపై స్థూలధారణ మొనర్చుటావశ్యకమగును. తర్వాత ఆతడు అందము, పారిశుద్ధ్యము, శాంతి, ఆనందము మొదలగు భావములపై సూక్ష్మధారణ మొనర్చుటకు శక్యుడగును.

గోడపైనున్న (చుక్క) మచ్చ, క్రొవ్వువత్తి, నక్షత్రములు, దేవుని పటము, నాసికలోని సో ఽ హంశ్వాస, సూర్యుడు, చంద్రుడు మొదలగు పదార్థములపై ధారణ మొనర్చుటకు ప్రయత్నించుము.

ఓ మోక్షప్రియా! క్రమముతప్పని ధారణ చాల ప్రాముఖ్యమైనది. నీ యభ్యాసమును ఒకరోజు కూడా విడువకుము. నియమితకాలము వఱకు, నిర్ణీత సమయమునందు ధారణమొనర్చుము. నీ యాహారమును సవరించు కొనుము. నీ స్నేహితుల నెన్నుకొనుటలో జాగరూకుడవై యుండుము. దుష్టసహవాసమును విడనాడుము. నీ గురువుపై, దేవునిపై భక్తి విశ్వాసములను కలిగియుండుము. ఓ సత్యప్రియా! ఓ సాధనధీరా! నీకు ధారణయందు నిశ్చయముగా విజయము చేకూరును.

ధ్యానము: ఓ మోక్షప్రియా! మిక్కిలి శ్రద్ధగలవాడవై ఏకాగ్రచిత్తముతో వినుము. "ధ్యానం నిర్విషయంమనః" విషయేంద్రియ సంకల్పమునుండి మనస్సును త్రిప్పుటయే ధ్యానము. ధ్యానమునందు మనస్సు కేవలము దేవునిపై లగ్నమగును.

ఆకస్మాత్తుగా నీవు ధ్యానము, సమాధులపై గంతులు వేయకుము. అట్లు చేసినచో నీవు క్రింద పడుటయేగాక నీ కాళ్లు విరిగిపోవును. 3వ తరగతి చదువుచున్న విద్యార్థి "సంబంధ విజ్ఞానము" "గణితశాస్త్రము" మొదలగువాటిని గూర్చి తెలిసికొనగలుగునా?

నిష్కామసేవ, భగవన్నామస్మరణ, ప్రాణాయామము మొదలగువాటిచే నీ హృదయమును శుద్ధపఱచుకొనుము. సదాచారమునందు స్థిర ప్రతిష్ఠుడవగుము. నైతికముగా పూర్ణుడవగుము. అప్పుడు మాత్రమే నీవు ధ్యాననిష్ఠయందు ప్రతిష్ఠింపబడుదువు.

ధారణనుబట్టి ధ్యానము, ధ్యానమునుబట్టి సమాధియు నీ కలవడును. ఓ మిత్రమా! ఓ మోక్ష ప్రియా! ధ్యానమునందు మొదట స్థూలమైన మనస్సు స్థూలమైన వస్తువు నాశించును. ప్రారంభము నందు మురళీకృష్ణుడు, శ్రీరామచంద్రుడు లేక బుద్ధదేవుని రూపములు ధ్యానమునందత్యావశ్యకములగును. ఇదియే సగుణ ధ్యాన మనంబడును.

క్రమముగా మనస్సు శుద్ధనిర్గుణబ్రహ్మము, రూపరహితమైన ఉన్నతోన్నతమైన బ్రహ్మమును గూర్చి చింతించుట కలవాటుపడును.

ఒక రోజులోగాని, వారము రోజులలోగాని, నెలరోజులలో గాని గాఢధ్యాన మలవడదు. నీవు చాలకాలము వఱకు పోరాడవలసియుండును. ఓర్పు కలిగియుండుము. వాసనలు, కోరికలు, వాంఛలనుండి విడివడుము. వైరాగ్యము, ముముక్షుత్వము, ఆత్మసాక్షాత్కారాసక్తి నభివృద్ధి పఱచుకొనుము. క్రమముగా నీకు ధ్యాననిష్ఠాగరిష్ఠత ప్రాప్తించును.

మోక్షప్రియా ! మరల మరల పోరాడుము. మిక్కిలి పరిశ్రమ యొనర్చుము. ధ్యానించుము. ధ్యానించుము. ధ్యానించుము. అంతమునందు నీకు నిశ్చయముగా విజయము చేకూరును. ఓ ఆధ్యాత్మికవీరుడా! నా మాటలను గుర్తుంచుకొనుము.

ధ్యానమునందాటంకములు : ఓ మోక్షప్రియా ! శ్రద్ధతో వినుము. "లయము, విక్షేపము, కషాయము, రసాస్వాదము, బ్రహ్మచర్యమును పాలింపకుండుట, ఆధ్యాత్మిక గర్వము, సోమరితనము, మాంద్యము, ప్రాపంచికుల సహవాసము, మితిమీఱి తినుట, మిక్కిలి పనిచేయుట, ప్రజలతో ఎక్కువగా కలియుట, ఆత్మనిర్ణయము, రాజసిక స్వభావము" ఇవి ధ్యానమునందు ముఖ్యమైన ఆటంకములు.

ప్రాణాయామము, ఆసనములు, అల్పాహార సేవనముల ద్వారా నిద్రను జయించుము. ప్రాణాయామము, జపము, ఉపాసన, పూజ, త్రాటకము మొదలగు వాటిద్వారా విక్షేపమును తొలగించుము. వైరాగ్యము, వివేకము, స్వాధ్యాయము, ధ్యానము, విచారణ మొదలగు వాటిద్వారా కషాయమును నశింపజేయుము.

నిమ్నమైన సవికల్ప సమాధి ననుభవించునప్పుడు రసాస్వాదమనెడి ఆనందము కలుగును. ఇది కూడా ధ్యానమున కాటంకమే. కారణమేమనగా దీనిచే యోగి, తాను ఉన్నతోన్నతమైన నిర్వికల్పస్థితిని చెందినట్లు పొరపడి, తన సాధననుండి విరమించుకొనును. కావున రసాస్వాదము నుండి పైకి లేచి, అతి ప్రయత్నముతో నిర్వికల్పసమాధిని పొందుము.

బ్రహ్మచర్యరాహిత్యముచే మనస్సపవిత్రమై, ఐహికజీవితవాంఛ పెంపొందును. మఱియు లైంగికవాసన బలవత్తరమగును. కావున అఖండ బ్రహ్మచర్య వ్రతము నవలంబించుము.

ముముక్షువు కొంత ఆధ్యాత్మిక పురోభివృద్ధి నొందినప్పుడాతనికి ఆధ్యాత్మిక గర్వమేర్పడును. తాను గృహస్థుల కంటె గొప్పవాడని తలంచును. మాయ అనేక రూపములను దాల్చును. ఆత్మవిచారణ, ఆత్మవిచక్షణల ద్వారా ఈ యాధ్యాత్మిక గర్వము నణచివేయుము.

సోమరితనము మరియొక ఆటంకము, ఆసనములు, ప్రాణాయామము నభ్యసించుము. ప్రతినిత్యము రెండు గంటల వరకు నిష్కామసేవ యొనర్చుము. పఱుగెత్తుము. బావినుండి నీటిని తోడుము. రాళ్ళను

మోయుము. అప్పుడు నీ సోమరితనము మటుమాయమగును.

ఆరోగ్య నియమములను, ఆరోగ్యశాస్త్ర సూత్రములను పాటించుము. నిత్యము వ్యాయామము, ఆసనములు, ప్రాణాయామములనభ్యసించుము. భోజన పానీయాదుల యందు మితమును కలిగియుండుము. అప్పుడు నీవు ఆరోగ్యసౌష్ఠవము గలవాడవగుదువు.

ఎల్లప్పుడు లైంగిక విషయములు, ద్రవ్యము మఱియు ప్రాపంచిక పదార్థములను గూర్చి మాట్లాడునట్టి ప్రాపంచిక వ్యక్తుల సహవాసమును వదలివేయుము.

మితిమీఱి పనిచేయకుము. దీనిచే నీకు బడలిక కలుగును. అందువల్ల నీవు ధ్యానింపజాలవు. ప్రజలతో ఎక్కువగా కలిసియుండకుము. దానిచే రాగద్వేషములు పెంపొందును. మనస్సు చంచలమై పరిభ్రమించును.

వినయము, వివేకము, విచారణ ధ్యానముల ద్వారా ఆత్మాహంకారమును పెంపొందజేయు రాజసిక స్వభావమును నశింపజేయుము. జాగరూకుడవై యుండుము. మనస్సును సత్త్వగుణముతో నింపివేయుము.

ఓ మోక్షప్రియా! పై ఆటంకముల నొక్కొక్క దానిని క్రమముగా తొలగించి వేయుము. ఆధ్యాత్మిక మార్గమునందు ధైర్యముగా ముందడుగును వేయుము.

ఆశ్రమ కంటి ఆసుపత్రి మూలనిధికి ఈక్రింది వారు పైకం పంపినారు

01. శ్రీమతి తీగల నిర్మలాదేవి (రిటైర్డ్ టీచర్),శ్రీకాళహస్తి	-రూ. 50,000/-
02. సి. హెచ్. మార్కొండయ్య (యోగామాస్టర్,శ్రీకాళహస్తి)	-రూ. 25000/-
03. డాక్టర్ డి.రాధేశ్యాం (విశాఖపట్టణం)	- రూ. 10,000/-
04. జి.గుర్నాథం (ఆల్వాల్)	- రూ. 10,000/-

సాధన పంచకమ్

- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

(గత సంచిక తరువాయి)

అజహల్లక్షణా: ప్రస్తుతము క్రమప్రాప్తమగునజహల్లక్షణను గూర్చి విచారింతము. 'అజహత్' అనగా విడువనిదని యర్థము. "శక్యార్థ అపరిత్యాగేన తత్సంబంధి అర్థాంతరే వృత్తిః అజహల్లక్షణా".

అథవా: "వాచ్యార్థం గృహీత్వా వాచ్యార్థ సంబంధిని శబ్దస్య యః సంబంధః సఃఅజహల్లక్షణా॥"

అథవా: లక్ష్యతావచ్ఛేదకరూపేణ లక్ష్యశక్యోభయబోధ ప్రయోజికా లక్షణా అజహల్లక్షణా॥"

వాచ్యార్థమును పూర్తిగా గ్రహించి (వదలక) తత్సంబంధముగల అన్యార్థమునందు ప్రవృత్తి అనగా వాచ్యార్థ సంబంధముగల అన్యార్థమును స్వీకరించుటే అజహల్లక్షణయనబడును. 'కాకేభ్యోదధిరక్ష్యతామ్' దీనికుదాహరణము. ఈవిధముగా 'శోణోధావతి'"ఛత్రిణోగచ్ఛన్తి" ఈ అజహల్లక్షణకుదాహరణములు.

"కాకేభ్యోదధిరక్ష్యతామ్" కాకులనుండి పెరుగును రక్షింపుము. అనగా కాకులు పెరుగును తినకుండా చూడుము యని దీని యర్థము.

ఎట్లనన? ఒక గృహస్థుని ఇంటిలో పెరుగుకి చీమలుపట్టినవి. ఆ పెరుగు భాండము బయట పెట్టి ఆ ఇంటి యజమానురాలు తన పుత్రుడైన యజ్ఞదత్తునితోయజ్ఞదత్తా! నేను వీధిలో పనిచూసుకొని వచ్చెదను. నీవు కాకులు వచ్చిన దూరము వెడలగొట్టి పెరుగును రక్షింపమని చెప్పి ఆమె బయటకు

నెక్లినవి. యజ్ఞదత్తుడు తల్లి అనుజ్ఞ ప్రకారము జాగ్రత్తగా చూస్తూ కాకులు వచ్చినపుడు వాటిని దూరముగా తోలుచుండెను. ఆ తరువాత పిల్లులు వచ్చి ఆ పెరుగునంతా తినినవి. యజ్ఞదత్తుడు చూస్తూనేయుండెను. కాని వాటిని మందలించలేదు. అనంతరము తల్లి వచ్చి దధిభాండములో పెరుగు లేకపోవడం చూసి కుమారునిపై కోపపడెను. అందుల కాతడు అమ్మా! తమరు చెప్పినట్లే కాకులు వచ్చినపుడు దూరముగా తరిమివేసితిని. పిల్లుల విషయము చెప్పలేదు కదా! యందుచేనూరికొంటినని చెప్పెను. అపుడు తల్లి పుత్రా! ఈ లాంటి వాక్యములు ప్రయోగము చేయునపుడు కాకులనుండి రక్షింపుచూ, ఇతరములైన పిల్లులు, కుక్కలు మొదలగు వాటి నుండి గూడ నర్థము గ్రహించవలెను అని పుత్రునితో చెప్పెను. ముఖ్యార్థమును గ్రహిస్తూ దానికి సంబంధమైన అన్యార్థమును గ్రహించవలెనని భావము.

బుద్ధిదారఢ్యమునకై వేరొక యుదాహరణను విచారింతము. 'శోణోధావతి' అనునది కూడా దానికుదాహరణము. రక్తవర్ణము పరుగెత్తు చున్నది అని దీని అర్థము. శోణశబ్దము అభిధావృత్తిచే రక్తగుణమును బోధించును. దానియందు పరుగెత్తుట అను క్రియ ప్రత్యక్షాది ప్రమాణ విరుద్ధమగును. కావు నీ స్థలమున శోణవిశిష్ట రక్తగుణము గలిగిన అశ్వమును స్వీకరించవలెను. శోణ శబ్దము తన యొక్క ముఖ్యార్థమగు రక్తవర్ణమును విడువక రక్త వర్ణముతో గూడినదియు అముఖ్యమునగు అశ్వరూపార్థమును లక్షణావృత్తిచే బోధించును. కావున"శోణోధావతి"అనగా ఎఱుపు వర్ణముగల అశ్వము పరుగెత్తుచున్నది యను లోక సమ్మతమగు యర్థము సిద్ధించును. ఇచ్చట శోణశబ్దము లక్షణమనియు, శోణవిశిష్ట మగునశ్వము లక్ష్యార్థమనియు, ఈ శబ్దార్థములకు గల సంబంధము అజహల్లక్షణయని జెప్పబడును.

"తత్త్వమసి" మహా వాక్యమునందు అజహల్లక్షణ ద్వారా అఖండార్థమును చెప్పుటకు వీలుపడదు. ఏలనన 'శోణోధావతి' యనుచోట ఎఱుపురంగు పరుగెత్తుట కుదరదు కనుక వాచ్యార్థము బాధింపబడినది. కావున ఎఱుపు రంగుగల గుఱ్ఱమును స్వీకరించినందున ఎఱుపు రంగు గలిగిన గుఱ్ఱము పరుగెత్తుచున్నదను వాక్యము సర్వులకు సమ్మతము గనుక విచారణపురుషుని ఆశయమును నెరవేరినది. కాని 'తత్త్వమసి' మహావాక్యము నందావిధముగా సిద్ధిజరుగదు. ఏలనన తత్పదమునకర్థము పరోక్షత్వ సర్వజ్ఞత్వాది విశిష్ట చైతన్యమైయున్నది. త్వంపదమునకర్థము ప్రత్యక్షత్వ అల్పజ్ఞత్వాది విశిష్టచైతన్యమైయున్నది. తత్ త్వం పదములకు చైతన్యాంశమునందు ఏకత్వము సిద్ధించును. కాని సర్వజ్ఞత్వాది అల్పజ్ఞత్వాదుల యందు విరోధమున్నది. కనుకనీ రెండింటికి భేదము తొలగకున్నది. కనుక నీతత్త్వమసి మహావాక్యమునందు అజహల్లక్షణచే సిద్ధికుదరదు.

వాచ్యార్థమును వదలకనే దానితో గూడిన అర్థమునకు అజహల్లక్షణ వర్తించును. అట్లైన గొప్ప వైరుధ్యము ప్రాప్తించును. ఏలనన పరోక్షత్వ ప్రత్యక్షత్వాది విశిష్ట చైతన్యం ప్రస్తుతం వాచ్యార్థమగును. కావుననిచట పరస్పర విరుద్ధ ధర్మములగు సర్వజ్ఞత్వాల్పజ్ఞత్వాదులు చైతన్యమునందు విరుద్ధములై యున్నవి. ఈ పరిస్థితిలోనజహల్లక్షణానుగుణ్యముగా నన్యార్థమును గ్రహించినచో వైరుధ్యము ప్రాప్తించును. కావుననిచట అజహల్లక్షణను గ్రహించుటకవకాశములేదు. కనుక 'తత్త్వమసి' మహావాక్యములనందు నిష్కార్థబోధకమగు జహదజహల్లక్షణయే యిచట నవశ్యముగా గ్రహింపదగినది.

మీ ఆలోచన మీ భవిష్యత్తును నిర్ణయించే సూక్ష్మ బీజము.

అర్థ మనర్థం....

- శ్రీ సర్వాత్మానందగిరి స్వాములవారు

ధర్మపురము అనే ఊరిలో శాంతినిలయము అనే భవనంలో ఒక స్వామి శ్రీశంకరాచార్య స్వామివారు ఉపదేశించిన భజగోవింద శ్లోకాలను గురించి వ్యాఖ్యానిస్తున్నాడు. జిజ్ఞాసువులైన శ్రోతలు శ్రద్ధగా వింటున్నారు.
స్వామి : "అర్థమనర్థం భావయ నిత్యం నాస్తి తతస్సుఖలేశ స్సత్యమ్" అని ఆచార్యులవారు బోధించారు. "అర్థోఽభిధేయ రై వస్తు ప్రయోజన నిర్వృతిషు" అని అమరము. దీనికి అర్థము-శబ్దముచేత సూచించబడినది, ధనము, వస్తువు, ప్రయోజనము అని. కాబట్టి అనర్థము అంటే భావము లేనిది, వస్తువు కానిది, ధనము కానిది, ప్రయోజనము లేనిది అనే గదా!

స్వామీ ! అర్థము అంటే శబ్దానికి అర్థమనీ, డబ్బు లేక ధనము అనే భావాలే ప్రసిద్ధంగా వున్నాయి గదా! ఆర్థిక శాఖ, ఆర్థిక వ్యవస్థ ఇత్యాది శబ్దాలు తఱచుగా వింటుంటాము.

ఫలాని పనికి చెయ్యమన్నప్పుడు, ఫలాని వస్తువును తెమ్మన్నప్పుడు, ఫలాని చోటికి వెళ్ళమన్నప్పుడు, ఫలాని మందును ఫలాని విధంగా ఉపయోగించమని చెప్పినప్పుడు ఆయా శబ్దాల యొక్క అర్థాన్ని లేక భావాన్ని సరిగ్గా గ్రహించినప్పుడే ఆశించిన లక్ష్యము నెరవేరుతుంది. అర్థాన్ని తెలియనప్పుడు నష్టము కష్టము కూడా ఎదురుకావచ్చును. కాబట్టి అర్థము అంటే శబ్దము యొక్క భావము అని చెప్పబడింది.

ఇక వస్తువు అంటే ఆహార పదార్థాలు, వాటి తయారీకి కావలసిన పాత్రాదులు, ఇంధనము, విద్యారంగములోని కాగితాలు, రంగులు యంత్రాలు, గ్రంథాలు ఇత్యాదులు, మనిషికి అవసరమైన వస్త్రాలు, గృహాలు వాహనాలు, భూములు, పశువులు, నగలు మొదలైన సకల వస్తువులు

కూడా ధనము చేతనే లభ్యమౌతాయి. ఇవన్నీ గూడా ధనముయొక్క మారు రూపాలే. అంటే ధనాన్ని వస్తువులు గానూ, వస్తువులను ధనంగానూ క్రయ విక్రయాల ద్వారా మార్చుకోవచ్చును. అందుచేత అర్థము అంటే వస్తువు అని కూడా చెప్పబడింది.

ప్రయోజనము అంటే మనిషికి లాభము, సుఖము, సంతోషాలను కలిగించేది అని అర్థము. ప్రాపంచికమైన సుఖ సంతోషాలను పొందాలి అంటే మరి ధనము యొక్క అవసరము ఎంతైనా వుంది. కాబట్టి అర్థము అంటే ప్రయోజనము అని కూడా చెప్పబడింది.

ఈ విధంగా అర్థము అనే శబ్దానికి గల నాలుగు భావాలుగూడా సరిఐనవే.

అర్థము అన్న శబ్దము తెలిసింది, స్వామీ! ఐతే "ధనం మూల మిదం జగత్" అనీ, ధర్మార్థ కామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాలలో గూడా అర్థము ప్రాప్తవ్యము అన్నారు గదా! దాన్ని అనర్థము అనడము ఏ విధంగా సమంజసము?

ప్రపంచములో ఏ కార్యము గూడా ధనము లేనిదే జరగదు. ప్రపంచమంతా వ్యక్తి, వస్తువు, క్రియలనే మూడింటి సంబంధమైన కార్యకలాపమే. కాబట్టి నీవు చెప్పింది సత్యమే. ఐతే అది అనర్థము అని ఎందుకు చెప్పబడిందో తెలుపుతాను విను-

అర్థము అంటే ధనమన్నది మనము ఈనాడు వాడుకునే రూపాయి కాగితాలే గదా! అవి నేరుగా వాటి రూపంలో దేనికి పనికి వస్తాయి? రూపాయి కాగితాలు దాహాన్ని తీర్చలేవు. ఆకలిని చల్లార్చలేవు. చలి, వేడి బాధలను పోగొట్టలేవు, రోగాన్ని నివారించ లేవు. సంతోషాన్ని ఇవ్వలేవు. ఏ పనినీ చెయ్యవు. ఐతే వాటిని ఉపయోగించి ఒక వస్తువునూ, కార్యాన్నీ చేసినప్పుడు మాత్రమే మనిషికి ప్రయోజనము. అంటే సంతోషము కలుగుతున్నది. కానీ ధనాన్ని సంపాదించి కేవలము కూడ బెట్టినంత మాత్రము చేత శ్రమనే తప్ప, మనిషికి కలిగే నిజమైన ఆనందమేమీ

లేదు. ధనముయొక్క సద్వినియోగము తెలియనప్పుడు అది అనర్థాన్ని అంటే నష్టాన్నీ, దుఃఖాన్నీ కలిగిస్తుంది అని భావము. జీవితావసరాలకు సరిపడినంత ధన సంపాదన ఎవరి చేతనూ అనర్థమని చెప్పబడలేదు.

మొదలు ధనాన్ని సంపాదించడము గురించి విచారిద్దాము – అపారమైన ధనాన్ని సంపాదించాలంటే, రాత్రింబగళ్ళు అనేకమైన ఆలోచనలతోనూ, ప్రయత్నాలతోనూ సమయమూ, శక్తీ ఖర్చైపోతుంటాయి. మనిషికి విశ్రాంతి అన్నది వుండదు. అల్పకాలంలో సంపాదించి సుఖ పడదామనే తపనతో, అన్యాయాలు అక్రమాలు ఐన మార్గాలను కూడా ఆశ్రయించడానికి మనసు వెనకాడదు. తత్ఫలితంగా పాపము ప్రాప్తించి భవిష్యత్తులో దుఃఖానుభావాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. అనేకమంది ధనసంపాదన వ్యసనంలో పడిపోయి విధ్యుక్త కర్మలను గూడా సక్రమంగా చెయ్యలేకనూ, శరీరపోషణకు అవసరమైన ఆహారాన్నీ, తగిన సమయాలను కూడా పాటించలేక కొంతకాలానికి ఆనారోగ్యము పాలై బాధలు పడుతుంటారు. ఆరోగ్యము పాడైతే తిరిగి సంపాదించుకోలేము గదా!

ఇక అదృష్టము బాగుండి అనారోగ్యము పాలు కాకున్నా వృద్ధాప్యము కలిగి శరీరము క్షీణించి బలహీనపడిపోయిన సమయాన, జీవిత లక్ష్యాన్ని తెలుసుకోక శ్రమించి సంపాదించిన ధనమూ, ఆ ధనము ద్వారా సంపాదించిన స్థిరచరాస్తులు మనిషికి ఏమి సుఖము నివ్వగలుగుతాయి? తన వారు మటుకు ఏ సహాయాన్ని చెయ్యగలుగుతారు? ఆ సమయంలో మనిషిని అంతులేని చింత మాత్రము వేధిస్తూంటుంది. దానికి తోడు పుణ్య లోపమేమైనా వుంటే దాయాదులందరూ తన పరిస్థితిని పట్టించుకోక ఆస్తులలో తమ భాగాల కోసము జరిపే వాదాలు, ఒత్తిడులు, భేదాలు, పేచీలు వ్యక్తిని చిత్రవధ చేస్తాయి. చివరకు కాలధర్మమైన మరణము ప్రాప్తిస్తుంది. తన వారికి గనక సుసంస్కారము లేనట్లైతే, తను కష్టించి సంపాదించిన ధనాన్ని తన సద్గతికి గూడా వారు ఉదారంగా

వినియోగించరు. అటువంటప్పుడు ధనార్జన కోసము పడిన తన ప్రయాస మనిషికి ఏ విధంగా ఉపయోగకరము?

రెండవది – సంపాదించిన ధనాన్ని రక్షించడంలో గల బాధలు – ధనము అధికంగా కలిగిందంటే దాన్ని బంధువులు, మిత్రులు, సమాజము అనేక విధాలుగా ఆశిస్తుంటారు. వారికి కావలసినది ఇవ్వనట్లైతే విరోధాలు, భేదభావాలు, కలహాలు, అసూయ, క్రోధము ఇత్యాది సమస్యల నెన్నింటినో ఎదుర్కోవలసి వస్తుంది. పోనీ, కాదనక వారికి ఇచ్చినట్లైతే అది తిరిగి వెనక్కి రాక బాధ కలుగుతుంది.

మూడవది – అధికమైన ధనము కలిగితే అవసరాలు, ఖర్చులు గూడా పెరుగుతాయి. భారీ ఎత్తున జరిపే విందులు, వివాహాలు, జన్మ దినాలు, విహారయాత్రలు, విదేశీ యాత్రలు, సంబరాలు ఇత్యాదులతో కష్టపడి సంపాదించిన ధనము ఖర్చౌతుంటే ఎవరికి సంతోషంగా వుంటుంది?

నాలుగవది – అధికమైన ధనం వలన వ్యసనాలు. అధర్మము, హింస, అసత్యము, దంభము, గర్వము, మదము, అవిశ్వాసము, పోటీ ఇత్యాదులు పుట్టి నిగ్రహము లేని మనిషికి అధోగతిని కలిగిస్తాయి.

శ్రీ మద్భాగవతము 11-23 వ అధ్యాయంలో గూడా ఇది చెప్పబడింది. కాబట్టి సారాంశమేమిటి అంటే, అర్థము అనర్థము అని కాదు, అర్థము మీద వ్యామోహము, వివేకరహితమైన మనస్తత్వము అనర్థకరము అని.

అధికమైన ధనంతో అనర్థముపాలు గాకుండా శాస్త్రాలు బోధించినట్టు దాన్ని పరమాత్మానుగ్రహాన్ని పొందడానికి, ఇష్టా పూర్త దత్తాలనే కర్మలలో సద్వినియోగము చేసి జీవితాన్ని సార్థకము చేసుకో వచ్చును. ఇష్ట కర్మలంటే భగవదారాధనమైన పూజలు, యజ్ఞాలు, పౌరాణిక కార్యక్రమాలు. దేవాలయాలు, విద్యాలయాలు, త్రాగునీటి బావులు

చెఱువులు. ధర్మశాలలు, జనులకుపయోగపడే ఉద్యానవనాలు, నదుల వద్ద స్నానఘట్టాలు మొదలైన వాటి నిర్మాణాలు పూర్త కర్మలు. వస్త్రదానాలు, అన్నదానాలు. ధనదానాలు ఇత్యాదులు దత్మకర్మలు. ఈవిధమైన సత్కర్మలను చేసి ధన్యులైన వారిని మనదేశంలో విస్తారంగా చూడవచ్చును.

పురాణాలను పరిశీలిస్తే సార్వభౌములైనవారు గూడా అర్థ వ్యామోహంతో సంసారంలో మునిగిపోక, ఋషభుడు, భరతుడు, పృథుచక్రవర్తి, ధ్రువుడు, మనువులు, ధర్మరాజు, పరీక్షిత్తు మొదలైనవారు, ఆధునికులైన తుకారాము, పురందర దాసు, మీరాబాయి, భారత స్వాతంత్ర్యోద్యమంలో అనేక మంది ధనవంతులు తమ జీవితాలను పరమ పురుషార్థమైన మోక్షాన్ని సంపాదించుకోవడానికి ప్రయత్నించి ధన్యులైనారు. శాశ్వతమైన కీర్తిమంతులైనారు.

శ్రోతలు: స్వామీ! తాము బోధించిన సత్యాన్ని గ్రహించాము. ఆ విధంగానే నడుచుకుని జీవితాలను సార్థకము చేసుకుంటాము. మీకు అనేక ధన్యవాదాలు, నమస్కారాలు. **ఓం తత్ సత్**

నీవు దర్శించాలంటే గ్రుడ్డివాడవు కమ్ము. నీవు (సత్యాన్ని) దర్శించాలనుకొంటే (ప్రపంచము పట్ల) గ్రుడ్డివాడవు కమ్ము.

నీవు (వాస్తవాన్ని) వినాలనుకొంటే (ప్రాపంచిక విషయాల పట్ల) చెవిటివాడవు కమ్ము.

నీవు (నిజాన్ని) మాట్లాడాలనుకొంటే (అసత్యం పట్ల) మూగవాడివి కమ్ము.

పరమాత్మయందు నీవు జీవింపదలిస్తే అన్వేషించు ! అవగతం చేసుకో! సాక్షాత్కృతి నొందు! **- స్వామి శివానంద**

భయంకర సూక్ష్మ జీవులు

- డా॥ నముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)
(గత సంచిక తరువాయి)

సూచీ తపః ప్రభావం

అది మళ్ళీ తన పూర్వరూపం పొందగోరి తపస్సు చేయాలనుకొన్నది. ప్రాణిహింస మానుకొన్నది. ముందు తాను తపస్సు చేసిన హిమగిరి శిఖరానికి బయలుదేరింది. లోహసూచికా రూపాన్ని జీవసూచికా రూపంతో మిళితం చేసింది. పిదప క్రియాశక్తితో హిమగిరి శిఖరం చేరుకొన్నది.

ఆ శిఖరంపై ప్రాణులేవీ లేవు. నలువైపులా దావాగ్ని వ్యాపించి వున్నది. ఆచోటంతా ధూళి దూరి సరితమై కనిపించింది. ఆ మరుభూమిలో హఠాత్తుగా మొలిచిన ఎండుగడ్డి మొలక లాగా ఆ రాక్షసి నిలబడింది.

అది ఒంటి పాదంపై నిలిచి తపస్సుకు ఉపక్రమించింది. దృష్టిని విషయసుఖాల నుండి పూర్తిగా మరలించింది. ఊర్ధ్వముఖియై తపోనిష్ఠకు పూనుకొన్నది. దూరంలో ఉన్న తీగలు, చెట్లు ఆ సూచిని చూడడానికి అఱ్ఱులు చాచాయి. మహా తపస్వినిని చూడాలన్న కోరిక ఎవరికి కలగదు? తపోవృత్తిలో ఉన్న ఆ కర్కటికి తరుగుల్మలతాదులు పుష్ప పరాగ పూరితమైన గాలిని ఆహారంగా పంపాయి. ముఖ రంధ్రంలో దూరిన ఆ పుష్ప పరాగాలను గూడా అది భోజనంగా స్వీకరించడానికి అంగీకరించలేదు.

ఇంద్రుడు దాని తపస్సుకు విఘ్నం కలిగించడానికి వాయు ప్రేరితమైన మాంసకణాలను పంపాడు. ఆ సూచిక వాటిని భుజించలేదు. బురద శిరస్సును కప్పివేసినా, జలప్రవాహాలు తన్ను ముంచి వేస్తున్నా, పెద్ద పెద్ద వడగండ్లు పైన బడుతున్నా, మహావాయువులు ఊగిస్తున్నా,

దావాగ్ని కాల్చి వేస్తున్నా. మబ్బులు ఉరుములతో ఉద్వేగం కల్గిస్తున్నా ఆకర్కటి తన ధృఢ నిశ్చయం నుండి చలించలేదు.

అది బాహ్య చేష్టలు లేని సత్యమైన ఆత్మను గురించే విచారించింది. దానికి జ్ఞానదృష్టి ఉదయించి తత్త్వం గోచరించింది. ఆత్మసాక్షాత్కారం లభించింది. దాని తపస్సు నిరాఘాటంగా ఏడువేల సంవత్సరాలు కొనసాగింది. పదునాల్గు లోకాలూ సంతాపానికి గురి అయ్యాయి. దాని తపస్సు హిమాద్రినే ఉడికించివేసింది. జగమంతా తీవ్ర దాహానికి గురి అయింది.

ఇంద్రుడు నారదుణ్ణి చూచి "ఈ లోకాన్ని ఇలా తపింపజేస్తున్నది ఎవరి తపస్సు?" అని ప్రశ్నించాడు. నారదుడిలా అన్నాడు.

"దేవేంద్రా! సూచీ రూపంలో ఉన్న కర్కటి వేల సంవత్సరాల నుండి ఇలా ఘోరమైన తపస్సు చేస్తున్నది. ఆ తపః ప్రభావం వల్లనే ఈ పరిస్థితి సంభవించింది. కొండలు చలిస్తున్నవి. వైమానికులు క్రింద పడిపోతున్నారు. సముద్రాలు శుష్కించిపోతున్నవి. దీనికి కంతటికీ రుద్రుని సంహార శక్తి వంటి కర్కటి యొక్క తపస్సే కారణం".

ఇంద్రుడు "మునీంద్రా! ఆ కర్కటి పూర్వం తపస్సుతో జీవసూచీ పిశాచిగా మారి ఏయే భోగాలనుభవించింది?"

అప్పుడా జీవసూచికి నల్లని ఇనుపసూది ఆశ్రయమయింది. ఒక్కొక్కసారి అది ఆ సూదిని వదలి వాయురథంపైకి ఎక్కి ప్రాణ వాయువనే దారిలో వెళ్ళి పాపాత్ముల శరీరాలలో ప్రవేశించేది. వారి ప్రేవులు, నాడుల రంధ్రంలో దూరి చెట్టు తొర్రలో దూరిన పక్షిలాగా అక్కడే దాగి వుండేది. రోగ వాయువు చేరిన వానిలో శూలబాధ కల్గించేది.

అట్టి కర్కటి ఇప్పుడు తన సంకల్ప బలంతో తాపసిగా మారింది. పూర్వం ఎదురు లేకుండా అన్ని దిక్కులా తిరిగింది. అసంఖ్యమైన ప్రాణుల శరీరాలలో చేరి, తిని, త్రాగి, యథేచ్ఛగా విహరించింది. ఆటపాటలతో స్వేచ్ఛగా కాలం గడిపింది. అదృశ్యంగా విహరిస్తూ అప్పుడది చేయని పని అంటూ ఏదీ లేదు.

మంత్రం, ఔషధం, దేవపూజ మొదలైన వాటి వల్ల ఒక్కొక్కసారి దెబ్బతిని కొండవాగులోని అలలాగా అది పరుగెత్తింది. ఇలా అది దశదిశలా తిరుగుతూ మానసిక తృప్తి పొందిందే కాని శారీరక తృప్తి పొందలేదు. అది తరువాత తన పూర్వ దేహాన్ని స్మరించుకొని ఉదరపూరణ సుఖం మీది కోరికతో దుఃఖించింది. అది తన పూర్వ శరీరం కొరకై తపస్సు చేయాలనుకొని ఆకాశంలో పోయే ఒక గ్రద్ద హృదయంలో ప్రవేశించింది. ఆ గ్రద్ద దానిని హిమాద్రి శిఖరానికి తీసుకుపోయింది.

అక్కడ జీవసూచిక లోహసూచికనే తన తపస్సుకు ఆలంబనంగా పరిగ్రహించింది. నాటి నుండి ఆకర్కటి అరణ్యాలలో తీవ్ర తపస్సు చేసింది. నీవు దానికి వరాలిచ్చి శాంతింపజేయి. లేకుంటే దాని తపస్సు లోకాలను దహించి వేస్తుంది".

నారదుని మాటలు విని దేవేంద్రుడు కర్కటిని వెదకడానికై వాయువును పంపాడు. వాయువు జంబూద్వీపం చేరి కర్కటి తపస్సు చేస్తున్న గిరిశిఖరం చేరుకొన్నాడు.

ఆ శిఖరంపై వాయువు ఆ సూచిని చూచాడు. అది ఒంటి కాలిపై నిలిచి తపస్సు చేస్తున్నది. ఆహారం తీసుకోకపోవడం వల్ల దాని పొట్ట మీది చర్మం శుష్కించి ముడుచుకుపోయి వున్నది.

వాయుదేవుడు దానిని చూచి విస్మయం చెందాడు. దానికి నమస్కరించి దానిని చాలాసేపు పరికించి చూచాడు. వెంటనే ఆకసానికి ఎగిరి పైపైకి పయనించి ఇంద్రుని వద్దకు చేరుకున్నాడు. ఇంద్రుడు ప్రశ్నించగా తాను చూచినదంతా ఇతర దేవతల సమక్షంలో వాయు దేవుడతనికి వివరించాడు. పిదప దానికి వరమిచ్చి తపస్సునుండి విరమింప జేయవలసినదిగా బ్రహ్మను ప్రార్థించడం కర్తవ్యమని బోధించాడు. లేకుంటే దాని తీవ్ర తపస్సు వల్ల మనకు అనర్థం తప్పదు అని కూడా హెచ్చరించాడు. పిదప వాయు ప్రేరితుడై ఇంద్రుడు దేవతలతో గూడా బ్రహ్మ చెంతకు వెళ్ళి జరిగిన సంగతంతా వివరించాడు. కర్కటి తపస్సును ఆపవలసినదిగా ప్రార్థించాడు.

అంతట బ్రహ్మ "నేను దానికి వరమివ్వడానికై హిమాద్రికి పోతున్నాను" అని చెప్పాడు. ఇంద్రుడు తిరిగి స్వర్గం చేరుకొన్నాడు. తపోబలంతో లోకాన్ని తపింపజేసిన సూచి పరమ పవిత్రురాలుగా మారిపోయింది.

కర్కటికి జ్ఞానోదయం కల్గిన పిమ్మట వెయ్యి సంవత్సరాలకు బ్రహ్మదేవుడు దాని చెంతకు వచ్చాడు. " పుత్రీ! వరం కోరుకో! " అన్నాడు. అది తిరిగి ఏమీ మాట్లాడకుండా తనలో తానిట్లనుకొన్నది.

"ఇప్పుడు నేను పరిపూర్ణురాలను. నాకు సందేహాలు లేవు. నేను శాంతంగా, తృప్తిగా, సుఖంగా వున్నాను. తత్త్వం నాకు తెలిసింది. నాకిక మరొక పదార్థంతో పనియేమున్నది".

ఇట్టి నిశ్చయంతో మౌనంగా వుండిపోయిన సూచిని బ్రహ్మ కొంత సేపు చూస్తూ ఉండిపోయాడు. తరువాత ఇలా అన్నాడు.

"కుమారీ! వరం తీసుకో! కొంతకాలం భోగాలనుభవించు. తరువాత పరమపదం పొందగలవు. నీ సంకల్పం సఫలమగుగాక! మళ్ళీ నీవు హిమాద్రి వనంలో బలిసిన రక్కసినిగా మారిపో! నీకు తత్త్వం తెలిసింది. కాబట్టి ముందులాగా నీవీ లోకాన్ని బాధించవు. పరిశుద్ధంగా వుంటావు. సదా ధ్యాన నిమగ్నవై వుంటావు. సమాధి నుండి వెలికి వచ్చినా సర్వాన్నీ ఆత్మగా భావిస్తావు. క్షుద్బాధా నివృత్తికై న్యాయమైన హింస మాత్రమే చేస్తావు. న్యాయమార్గం అతిక్రమించిన వారినే బాధిస్తావు. జీవన్ముక్తురాలవై వివేకరక్షణలో వుంటావు."

బ్రహ్మ ఇలా చెప్పి తిరిగి తన లోకానికి వెళ్ళిపోయాడు. "బ్రహ్మ మాటను నేనెందుకు కాదనాలి?" అంటూ కర్కటి క్రమంగా తనలో తన పూర్వ రూపాన్ని భావించింది. వెంటనే స్థూల స్వరూపం పొందింది. (తరువాతి వృత్తాంతం కొరకై యోగ వాసిష్ఠం ఉత్పత్తి ప్రకరణం - ఉత్తరార్థం చూడండి)

వైఫల్యాలకు భయపడకు

ప్రతిబాధ యందు ముసుగులో ఒక దీవెన ఉంటుంది.

కలిగిన ప్రతి దుఃఖము దైవము పెట్టే పరీక్షయే!

ప్రతి ఆటంకము పరిణామమునొందుటకు ఒక మెట్టు.

ప్రతి వైఫల్యము ప్రగతికి బాట.

భయపడకు. వెనుదిరిగి చూడకు. ధైర్యంగా ఉండు.

ముందుకు నడు, దైవం దిశగా మున్ముందుకు సాగు.

- స్వామి శివానంద

గృహస్థాశ్రమము

-ఎ. తారాలక్ష్మి, ఎం.ఎ., ఎం.ఇడి., ఎమ్.ఫిల్. పి.హెచ్.డి.
(శ్రీకాళహస్తి)

చతురాశ్రమ ధర్మాలలో గృహస్థాశ్రమము రెండవ భూమిక. గురుకుల వాసము పూర్తి అయిన పిదప శిష్యుడు తన శక్త్యనుసారము గురువునకు దక్షిణ నొసంగి గురుకులమును వీడి తన గృహమునకు వెళ్ళుటకై ఆచార్యుని అనుమతిని కోరును. అంతట గురువు శిష్యునకు అంత్యోపదేశము చేసి గృహస్థాశ్రమమున ప్రవేశించించుటకు అనుమతి నొసంగును.

గృహస్థ జీవితములో చేపట్టబోవు బాధ్యతలను, కర్తవ్యములను నిర్వహించుటకై అవసరమైన సామర్థ్యములను పొందిన బ్రహ్మచారి వివాహము చేసికొని గృహస్థాశ్రమమును చేపట్టును. గృహస్థాశ్రమము మిగిలిన మూడు ఆశ్రమములకు ఆధారభూతము. బ్రహ్మచారులకు, వానప్రస్థులకు, సన్యాసులకు గృహస్థే కేంద్ర బిందువు. గృహస్థ జీవితము కర్తవ్యాలతో, దానధర్మాలతో కూడి ఉంటుంది. గృహస్థుడు ఎందరికో ఆశ్రయదాత. గృహస్థుడు న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా ధనమును ఆర్జించి, దానిని సరియైన విధముగ ఖర్చుపెట్టవలెను. తన ఆదాయములో కొంత ధర్మకార్యములకై వినియోగించవలెను. నైతిక విలువలను పాటించుచు విషయ సుఖములను అనుభవించవలెను.

గృహస్థాశ్రమ ధర్మములలో అతి ముఖ్యమైనది. పంచమహా యజ్ఞములు. దేవ యజ్ఞము, ఋషి యజ్ఞము, పితృయజ్ఞము, భూత యజ్ఞము మరియు అతిథి యజ్ఞము అనునవి పంచ మహాయజ్ఞములు.

దేవతలు, మహర్షులు, పితృ దేవతలు, భూతములు మరియు అతిథులు గృహస్థులపై ఆధారపడి సహాయాన్ని ఆపేక్షిస్తారు. కనుక గృహస్థు ఈ పంచ మహాయజ్ఞాలను తప్పక ఆచరించవలెను.

మానవుడు వైదిక మార్గమును అనుసరించుచు అనుదినము ఇష్ట దేవతారాధన చేయవలెను. దేవతలకు ఆహుతులను సమర్పించవలెను. అనుదినము గృహస్థు తన గృహములో దైవ ఆరాధన క్రమము తప్పక చేయవలెను. విశిష్ట దినములలో ప్రత్యేక పూజలు, క్షేత్ర, తీర్థ సందర్శనములు మొదలైన కార్యములను నిరంతరము చేపట్టవలెను.

గృహస్థు అనుదినము శాస్త్ర గ్రంథములను, ధర్మ గ్రంథములను అధ్యయనము చేయాలి. తాను పొందిన జ్ఞానాన్ని ఇతరులతో పంచుకోవాలి. ఉపనిషత్తులు, రామాయణ, భారత, భాగవతాది గ్రంథములను క్రమం తప్పక చదవడం, పురాణ శ్రవణము చేయడం, సత్ సంగాలలో పాల్గొనడం ద్వారా గృహస్థు ఋషి యజ్ఞాన్ని ఆచరించాలి.

జీవించి యున్న తల్లిదండ్రులను భక్తి శ్రద్ధలతో పూజించుట, మరణించిన పితృదేవతలకు తర్పణములను, శ్రాద్ధములను, అబ్ధికములను శ్రద్ధతో ఆచరించుట ద్వారా గృహస్థు పితృ యజ్ఞమును ఆచరించవలెను.

గృహస్థు తన సమీపములో నున్న వృక్ష, పక్షి, మరియు జంతు జాతులకు ఆహారము సమర్పించుట ద్వారా భూత యజ్ఞమును ఆచరించవలెను.

అతిథి సత్కారము గృహస్థు ముఖ్య కర్తవ్యము. గృహమును సందర్శించు అతిథులకు భోజన సదుపాయములను చేసి వారిని ఆదరించుట ద్వారా గృహస్థు అతిథి యజ్ఞములను నిర్వర్తించవలెను.

పంచ మహాయజ్ఞములు ఆచరించిన గృహస్థులో సత్వగుణం బాగా అభివృద్ధి చెందుతుంది. అతనిలో అరిషడ్వర్గాలు నశిస్తాయి. ఆతనికి శాంత స్వభావము అలవడుతుంది. జీవితం పట్ల విశాల దృక్పథం ఏర్పడుతుంది. మహర్షులచే రచింపబడిన శాస్త్ర గ్రంథాలను అధ్యయనం చేయడం వలన ఆతను ఆధ్యాత్మికంగా ఎంతో ఉన్నతిని పొందుతాడు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల మరియు పితృదేవతల ప్రాముఖ్యతను గుర్తెరుగుతాడు. తన చుట్టూ ఉన్న జగత్తులో తన అస్తిత్వాన్ని గుర్తిస్తాడు.

గృహస్థాశ్రమ ధర్మములను చక్కగా శీలించిన వ్యక్తి ఆధ్యాత్మికంగా కూడా ఎంతో ఉన్నతిని పొందుతాడు. పదుగురికి ఆదర్శప్రాయంగా సరైన మార్గంలో జీవిస్తాడు. ఆధునిక గృహస్థు పై చెప్పబడిన గృహస్థాశ్రమ ధర్మములను క్రమంతప్పక ఆచరించినట్లయిన మెరుగైన సమాజం ఏర్పడగలదు.

శ్రీమద్ రామాయణములో చిత్రకూటము నందు శ్రీరామచంద్రుడు భరతునికి ధర్మబోధ చేయు సందర్భంలో శ్రీరాముడు భరతునితో "నీవు గురుజనులకు, తపస్వులకు, దేవతలకు, పెద్దలకు, అతిథులకు, పవిత్ర వృక్షములకు నమస్కరించుచున్నావా?" అని ప్రశ్నించుటలో పంచ మహా యజ్ఞములను భరతునకు గుర్తుచేసినట్లు అవగతమవుతుంది. కావున గృహస్థులు పంచమహాయజ్ఞములను చక్కగా శీలించి తమ జీవితములను ధన్యత నొందించుకొనగలరు.

నైతిక సిద్ధాంతములు లేని రాజకీయములు,
దాన ధర్మములు లేని ధనము,
సద్గుణములు లేని విద్య,
మానవత్వము లేని విజ్ఞానము, త్యాగము లేని కర్మ
} వ్యర్థము

కరోనాకు నివారణోపాయం

- ఆచార్య కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

జబ్బులు రావడానికి అనేక కారణాలు. అపరిశుభ్రత, చెడు అలవాట్లు ప్రధాన కారణాలు. కాని భారతీయులు పూర్వజన్మ కర్మలంటారు. మానవులు అధర్మ ప్రవర్తకులయితే దేవుడే వాళ్ళ కళ్ళు తెరవడానికి అతివృష్టి, అనావృష్టి, మిడతల దండు లాంటివి సృజిస్తాడు. అయినా కొట్టిన చేయేకోరు అన్నట్టు దేవుణ్ణి ప్రార్థిస్తే ఆ దేవుడే రోగాలు నయం చేస్తాడు. కరోనా ఈనాడు వ్యక్తి రోగం కాదు. నేడు ప్రపంచ రోగం.

నత్కీరుడు శివనింద చేశాడు. శివుడు వ్రాసి ఇచ్చిన పద్యంలో తప్పు చూపాడు. ఫలితం శివుడు కుష్ఠరోగివి కమ్మన్నాడు. చివరకు శ్రీకాళహస్తీశ్వరుని శిఖరం దర్శించగానే కుష్ఠరోగం నయమయింది.

మయూరునికి కుష్ఠరోగం. అతడు 'ఆరోగ్యం భాస్కరా దిచ్ఛేత్' అని సూర్యుని సేవించాడు. రోగం నయమయింది. సూర్యశతకం వ్రాశాడు.

ముత్తుస్వామి దీక్షితర్ వాగ్గేయ కారులలో మంత్రశాస్త్రం తెలిసినవాడు. తపస్వి. ఒకసారి దీక్షితర్ శిష్యునికి శుద్ధ మద్దళం తంబియప్పను శూలవ్యాధి వచ్చింది. ఎన్ని వైద్యాలు చేసినా రోగం నయం కాలేదు. శిష్యుని జబ్బు, అవస్థ చూసి గురువు చలించాడు. జ్యోతిష్కులు గురు శనిగ్రహచారం బాగా లేదన్నారు. దీక్షితర్ అపుడు గురుగ్రహ, శనిగ్రహ ప్రార్థన చేశారు. ఆ కీర్తనలు చాలా ప్రసిద్ధాలు. ఇతరులు కోరితే ఇతర గ్రహాలపై కూడా పాటలు పాడారు. వీటిని నవగ్రహ కీర్తనలంటారు. దీక్షితర్ పాడిన గురుగ్రహ కీర్తన.

బృహస్పతే తారాపతే
బ్రహ్మాజాతే నమోస్తుతే

మహాబల విభోగిష్పతే

మంజు ధనుర్మీనాధిపతే

మహేంద్రాద్యు పాశ్రితాకృతే

మాధవాది వినుత ధీమతే ॥ ఇలాగే మరి రెండు చరణాలు. శనిగ్రహ కీర్తన - దివాకర తనూజం శనైశ్చరం

ధీరతరం సంతతం చింతయేఽ హమ్

భవాంబునిధౌ నిమగ్న జనానాం

భయంకరం అతిక్రూర ఫలదం

భవానీశ కటాక్ష పాత్రభూత

భక్తిమతాం అతిశయ శుభఫలదమ్ ॥ భక్తితో ఇలాంటి కీర్తనలు చదివినా, పాడినా రోగాలు నమయవుతాయి. ఇలాంటి వృత్తాంతాలెన్నో.

కరోనా విజృంభణ దశలో కరుణాళువయిన శ్రీకాళహస్తీశ్వరుని ప్రార్థిద్దాం. నవగ్రహాధిపతిని స్తుతిద్దాం.

భక్తవత్సలుడు కరుణించాలని ప్రార్థన చేద్దాం.

పంచుకోవడంలోనే నీ ఎదుగుదల ఉన్నది

సేవయందే నీ ఉన్నతి ఉన్నది
పంచుకోవడంలోనే నీ ఎదుగుదల ఉన్నది
ప్రార్థించుటయందే నీ పరిశుద్ధత ఉన్నది
విజ్ఞాని యగుటయందే నీకు ముక్తి ఉన్నది
సేవించు, పంచుకో, ప్రార్థించు,
ధ్యానించు, సాక్షాత్కృతిని పొందు.

- స్వామి శివానంద

మూలం: వేదవ్యాసమహర్షి

ఉద్ధవ గీత

అనువాదం: యేలేశ్వరపు హనుమరామకృష్ణ

(గత సంచిక తరువాయి)

ఓ ఉద్ధవా! ఒక ముఖ్యమైన పార్యాంశాన్ని గమనించాలని నీ ద్వారా జనులందరికి గుర్తు చేస్తున్నానయ్యా !

శ్లో ॥ ఛిద్యమానం యమైరేతైః కృతనీడం వనస్పతిమ్
ఖగః స్వకేతమ్ ఉత్సృజ్యక్షేమం యాతి హి అలంపటః (అధ్యా 20,శ్లో 15)

ఒకానొక గరుడ పక్షి ఒక పెద్ద వృక్షముపైగల అనువైన చోట ఒక పెద్దగూడు అందంగా కట్టుకొని భార్య, పిల్ల -పాపలతో హాయిగా నివసిస్తోంది. రోజులు గుడుపుతోంది. ఒక రోజు కొంతమంది బోయవాళ్ళు ఆ మహావృక్షము క్రింద నిలబడి, 'అరె! రేపు మళ్ళీ వద్దాం! ఈ మహా వృక్షమును వంటచెరకుకై రాజుగారి వంటశాలకు అందజేద్దాం! దుడ్లు (డబ్బు) బాగా లభిస్తాయి..." అని చెప్పుకుంటున్నారు. కొంతసేపైన తరువాత వారంతా వెళ్ళిపోయారు.

తన గూడులో హాయిగా కూర్చుని ఉన్న ఖగరాజు (పక్షి) ఇట్లా అనుకొన్నది. 'ఆహా! యమభటులవంటి ఈ ఆటవికులు రేపువచ్చి ఈ వృక్షమును నరకబోతున్నారు కాబోలు! వాళ్ళ కళ్ళబడ్డామా, నన్ను - నా భార్య - బిడ్డలను బంధించి తీసుకుపోగలరు, ఏం చేద్దాంరా బాబు?" అని ఆలోచించసాగింది. ఆడ పక్షిని పిలిచి తాను విన్నదంతా చెప్పి "ఏం చేద్దాం? చెప్పు?" అన్నది. ఆడపక్షి అంటోంది.

ఇంక చేసేదేమున్నదయ్యా? ప్రమాదం వచ్చేవరకు తీరికగా కూర్చుని ఉంటామా? లేదు. పదండి. ఈ వృక్షము,ఈ గూడు వదలి మరొక చెట్టును చూచుకొని గూడు కట్టుకుందాం !

వెంటనే ఆ పక్షుల కుటుంబం రాత్రికి రాత్రే మకాం మార్చి సుమారంగా ఉన్న వేరొక మఱ్ఱిచెట్టుపై వ్రాలి గూడు కట్టుకోనారంభించాయి. ఆమాత్రం పక్షులకు ఉన్న తెలివి మానవుడికి ఉండనక్కర్లేదా? ఏమాత్రం తెలివి ఉన్నా కూడా...

- అయ్యో! రోజు రోజుకు ఆయుష్షు తగ్గుతోందే! యమభటులు ఒకానొకరోజు చెప్పా పెట్టకుండా వచ్చి ఈ దేహమును లాక్కుపోబోతున్నారు కదా! కనుక అత్యావసరంగా -శేషించి ఉన్న ఆయుష్షును సద్వినియోగం చేసుకోవాలి కదా! అని తలుస్తాడు. భయపడతాడు. సంగమును త్యజించి పరబ్రహ్మమును గుర్తించి తెలుసుకోవటానికి ప్రయత్నిస్తాడు. దృశ్యము - దేహములకు సంబంధించిన సర్వ కామములు త్యజించి క్రమంగా నిష్కాముడై పరమశాంతిని సముపార్జించుకుంటాడు. ఆత్మభగవానునితో మమేకమయ్యే ప్రయత్నములను తీవ్రపరచుకుంటాడు.

ఈ మానవ శరీరము సర్వఫలములు సంపాదించుకోవటానికి గొప్ప ఉపకరణము. అత్యంత దుర్లభంగా మాత్రమే లభిస్తుంది. చక్కటి కరణాలు (చూపు - వినికిడి మొదలైన ఇంద్రియ శక్తులు) ఈ దేహంలో ఉన్నాయి. కనుక సంసార సాగరమును దాటటానికి ఇది గొప్ప దృఢమైన నౌక!

- శరణు వేడితే చాలు, గురుదేవులు ఆత్మవిద్యను బోధిస్తారు. కర్ణధారులై (పడవను నడిపే ఆయన) అటు సంసార సాగరం దాటిస్తారు.

- భగవంతుని స్మరిస్తూ, శాస్త్రానుకూలమైన మార్గంలో కర్మలు నిర్వర్తిస్తూ వుంటే.. ఈ పడవ లక్ష్యము వైపుగా తీసుకుపోతుంది అని ఈ జీవుడు తీవ్రంగా అనుకోవాలి. ఇంత చక్కని సర్వానుకూలమైన మానవదేహమును ఉపయోగించుకుని శాస్త్ర-గురు ప్రవచిత సాధనలకు ఉపక్రమించి సంసారసాగరము నుండి తరించటం, ఆధ్యాత్మిక జ్ఞానమును పెంపొందించు

కోవటం అనే మార్గంలో ప్రయత్నాలు నిర్వర్తించకపోతేనో? ఇట్టివాడు లభించిన అవకాశమును రెండు చేతులా జార్చుకుంటున్నట్లే! ఆత్మద్రోహం చేసుకుంటున్నట్లే! అధఃపతనమును తెచ్చిపెట్టుకుంటున్నట్లే! చదువుకోరా అని తండ్రి మంచి బడిలో జేర్పిస్తే, అల్లరి చిల్లరి పనులతో రోజులు వృధా చేసుకోవటం వంటిదే! ఈ మనస్సు ఇంద్రియవిషయముల వైపుగా అతి వేగంగా ప్రయాణిస్తోంది! ఒక్క విషయం కాదు. రెండుగాదు ఒకేసారి సహస్రాధికంగా అనేక విషయములను అనుక్షణం మార్చి మార్చి యోచనలు చేస్తూ దేహమున్నంత వరకు అతి చంచలమై ఉంటోంది. దేహము బాగున్నంత వరకు ఆత్మ జ్ఞానమునకు ఉపక్రమించకపోవటంచేత, వేదములు చెప్పే సాధనలను శ్రద్ధగా నిర్వర్తించి యత్నించకపోవటంచేత- పర్యవసానం? దేహమున్నప్పుడు - దేహానంతరం - మరొక దేహము ఆరంభమౌతున్నప్పుడు కూడా ఉద్విగ్నత -దుఃఖము - భయము ఇత్యాదులు తొలగటమేలేదు. విజ్ఞులగువారు ఇదంతా గమనిస్తున్నారు. "యేహి సంస్పర్శజా భోగాః దుఃఖయోనయ ఏవతే। ఆద్యంతవంతః" అని మునుముందుగానే గుర్తిస్తున్నారు. కర్మ - కర్మ ఫలములపట్ల విరక్తులగుచున్నారు. దృశ్య ఫలములపట్ల గల అనురక్తిని ఉపశమింపజేసుకొనే మార్గమును అన్వేషించి - ఆశ్రయిస్తున్నారు. ఆత్మజ్ఞానమునకు సంబంధించిన వృత్తులను స్వీకరిస్తూ నిశ్చలమైన భావంతో - యోగభావంతో మనస్సును ధరించే ప్రయత్నాలు చేస్తున్నారు.

అయితే.. ఈ మనస్సు సముద్రతరంగాలకన్నా - వాయుతరంగాలకన్నా అతి చంచలం కదా! ఇది లక్ష్య వస్తువుపై నిలకడగా ఉండదు. అది గమనించిన యోగి ఈ మనోబాలకుణ్ణి (లేక) చిత్తబాలకుణ్ణి అనురోధమైన (అనుకూలమైన - through positive methods) మార్గముల ద్వారా స్వాధీనం చేసుకోవాలి. అంతేగాని, మనోగతిని ఉపేక్షించి, తగిన సాధనలకు ఉపక్రమించకుండా రోజులు గడుపరాదు.

మనోగతిం న విసృజేత్ జితప్రాణో జితేంద్రియః

సత్త్వ సంపన్నయా బుద్ధ్యా మనః ఆత్మవశం నయేత్ ॥ (అధ్యా 20 శ్లో 20)

ఇంద్రియములను సాధనల ద్వారా జయిస్తూ (జితేంద్రియుడగుచు) ప్రియ స్వభావమైన ప్రాణములను వశం చేసుకుంటూ (జితప్రాణుడగుచు)... సత్త్వగుణ సంపన్నమైనట్టి బుద్ధి ద్వారా బుద్ధిని ఆత్మవశం చేసుకోవాలి!

అది ఎటువంటి ప్రయత్నమంటే...,

అశ్వారూఢుడు (గుర్రపురౌతు) గుర్రమును అధిరోహించి ఒక ముఖ్యమైన పనికోసం ఒకచోటికి బయలుదేరాడనుకో ! ఆ గుర్రము తనకు యిష్టం వచ్చిన మార్గంలో ఎటో అడవుల వైపుగా మేతకోసం పరుగులు తీస్తూ ఉంటే, "ఆ! ఏం చేద్దాం! పోనీలే!"- అని చూసీచూడనట్లు ఊరుకుంటాడా? ఊరుకుంటేనో? (లేక) ఏవేవో అనవసరమైన వ్యాపకాలు మననం చేస్తూ మీనమేషాలు లెక్కపెట్టుకుంటూ ఉంటేనో? ఏమౌతుంది? ఆ గుర్రపుస్వారీ చేసే ఆయన తను చేరవలసిన స్థానం (పట్టణం) చేరుతాడా? లేదు. ఏ అడవులలోనో చిక్కుకుని బహుయాతనలు పడతాడు. ఇది గమనించి, ఆ రౌతు ఏం చేస్తున్నాడు? "ఈ గుర్రము నా మనోభావాలు గమనించి నేను వెళ్ళవలసిన వైపుగా పరుగెత్తాలి? ఈ గుర్రం నా మాట వినేటట్లు చేసేది ఎట్లా?" అని ఉపాయాలు యోచిస్తున్నాడు. కార్యరూపంగా ఆ ఉపాయాలు నిర్వర్తించి గుర్రము తన స్వాధీనమయ్యేటట్లు చేసుకుంటున్నాడు.

- పగ్గములను పట్టుకొంటాడు.

- పూర్తిగా విడువడు. అట్లా అని గుర్రములు కదలనంతగా పట్టుకోడు.

- మంచి శబ్దములతో - స్పర్శలతో - చర్నాకోలుతో - మాటలతో.. తను అనుకున్న వైపుగా ముఖం త్రిప్పి పరిగెత్తేటట్లు చేసుకుంటున్నాడు.

ఆ గుర్రపు రౌతులాగానే మానవుడైనవాడు ఈ మనో అశ్వమును నయాన -భయాన - వేద -వేదాంగములు -స్మృతులు - శాస్త్రాలు - గురువులు ప్రబోధిస్తున్న సాధన సంపత్తియొక్క సహాయముతో తనవశం చేసుకోవాలి.

ఈ మనస్సు నిశ్చలత్వం పొందేవరకూ ఈ జీవుడు సాధనలను - తత్త్వజ్ఞానమును ఆశ్రయించాలి. ఈ దృశ్యములో అనుభవమగుచున్న స్థూలదేహము నుండి మహత్తత్త్వము వరకు గల సర్వ పదార్థములను

- అనులోమక్రమ సృష్టి గురించి (How from nothing every thing is coming out and appearing)

- ప్రతిలోమ క్రమ ప్రళయము గురించి (How everthing is eventually getting into nothing)

మనో - బుద్ధుల సహాయంతో యోచించాలి. గమనించాలి. నిర్వేదము (Non - worrying), వైరాగ్యయుక్తము (Detatchment) అగు చిత్తమును సంపాదించుకోవాలి. ఒకవైపు నుండి అటువంటి నిర్మల - నిశ్చల చిత్తముతో గురూపదేశములను - గురువుల ఉద్దేశ్యములను పఠించి - పాటించి మరొకవైపు ప్రాణాయామ - పూజాది కార్యక్రమములకు ఉపక్రమిస్తూ - క్రమంగా దేహాభిమానమును త్యజించాలి.

దృశ్యాభిమానం త్యజించటం (లేక) జయించటం మాటలతో చెప్పుకొనేంత తేలికైనది కాదు. అందుకుగాను యమము - నియమము - ధారణ ఇత్యాది యోగమార్గములకు (సాధనలకు) ఉపక్రమించాలి. మరొకవైపుగా వస్తుతత్త్వమును పరిశీలన చేస్తూ తర్కవిద్య ద్వారా సర్వాధారమైన పరతత్త్వముయొక్క అవగాహనను పెంపొందించుకుంటూ ఉండాలి. ప్రతిమలను అర్చించటం - ధ్యానించటం ఇవన్నీ కూడా ఏకాగ్రతకు ఉపాయాలై ఉన్నాయి. అవన్నీ అవసరమే !

దేహమున్నంతవరకు కర్మలు అనివార్యం. కర్మలు కొంత దోషముతో

కూడుకొనియే ఉంటాయి. అందుచేత యోగి అయినవాడు ప్రమాదవశాత్తు ఏమైనా నిందితకర్మలు నిర్వర్తిస్తూ ఉంటే.... వాటిని లోకానుకూలంగా మరల్చుకోవాలి. మరొకవైపుగా వాటి - వాటి దోషముల నివృత్తికొరకై ప్రాణాయామాది యోగసాధనల ద్వారా ప్రయత్నము కొనసాగిస్తూ ఉండాలి కూడా !

ఆ ప్రాయశ్చిత్తకర్మలు కూడా - సులభంగాను-జనులకు అనుకూలంగాను ఉండాలే గాని... లోకాలను బాధించేటట్లు, తనను తాను బాధించుకునేటట్లు ఉండరాదు సుమా !

వేదాన్తభేరి జీవిత (ఎల్) చందా దారులకు విజ్ఞప్తి

వేదాన్తభేరి జీవిత చందాదారులకు (రూ.350/-, రూ.500/- కట్టిన వారికి) ఇదివరలో ప్రకటించిన ప్రకారం 2020 డిశంబరు నెలతో వారి చందాలు పూర్తి యగును.

కాబట్టి జీవిత (ఎల్ గుర్తు) చందాదారులకు పత్రిక డిశంబరు నెలతో ఆపివేయబడును. జీవిత చందాదారులు మరో రూ. 1500/-లు కట్టినచో వారిని పోషక చందాదారులుగా పరిగణించి పత్రిక ఎప్పటికీ పంపబడును. అందువలన (ఎల్) జీవిత చందాదారులు వారి ఎల్ నెంబరు తెలుపుతూ మరో రూ. 1500/-లను వేదాన్తభేరికి చెక్కురూపంలో గాని, డి.డి.రూపంలో గాని. మనీయార్డర్ రూపంలో గాని పంపగోరుచున్నాము. పత్రిక ఆర్థికంగా నష్టంలో నడుస్తూంది అని గుర్తించగలరు.

1-09-2020

ఇట్లు

పబ్లిషర్స్, వేదాన్తభేరి

శ్రీ శుకబ్రహ్మాశ్రమం

వేదాన్తసారము - శ్రీ సదానంద యోగీంద్రులు

(గత సంచిక తరువాయి)

నిగృహీతస్య మనసః శ్రవణాదౌ

తదనుగుణ విషయేచ సమాధిః సమాధానమ్ ॥

తా ॥ ఇట్లు నిగ్రహించిన మనస్సును శ్రవణమననాదులందును, తదనుగుణమైన గురు శుశ్రూషయందును, శాస్త్ర గ్రంథ రచనాదులందును ఏకాగ్రపరచుట సమాధానమగును.

గురూపదిష్ట వేదాంత వాక్యేషు విశ్వాసః -శ్రద్ధా ॥ 24

తా॥ విశ్వాసములేక ఆధ్యాత్మిక సాధన కాంక్షించిన ఫలము నొసగ జాలదు. కావున గురూపదిష్టమైన వేదాంత వాక్యములందు నమ్మకమే శ్రద్ధ యనబడుచున్నది.

ముముక్షుత్వం - మోక్షేచ్ఛా ॥ 25

తా॥ మోక్షమందు ఇచ్ఛయే ముముక్షుత్వము. పైన చెప్పిన మూడు సాధనలు గలవానికి మోక్షమందు తప్పక కోరిక కలిగి తీరును. అప్పుడే ఆ సాధకుడు ఆత్మవిద్యను పొందుటకు తగిన అధికారి యగుచున్నాడు.

ఏవం భూతః ప్రమాతాధికారీ "శాన్తో దాంతః"

(బృ-ఉ--4-4-23)ఇత్యాది శ్రుతేః । ఉక్తంచ

ప్రశాంత చిత్తాయ జితేంద్రియాయ చ

ప్రహీణదోషాయ యథోక్తకారిణే ।

గుణాన్వితాయానుగతాయ సర్వదా

ప్రదేయమేతత్ సతతం ముముక్షవే ॥ ఇతి॥7 26

(ఉపదేశ సాహస్రీ -324-16-72)

తా॥ ఇట్టి లక్షణములు గలవాడే అధికారి యగుచున్నాడు.

వార్తలు

(01). ఆశ్రమంలో చాతుర్మాస్య వ్రతం ఆనందంగా జరుగుతూ వుంది. ప్రతిరోజు ఉదయం గీతాపారాయణానంతరం కైవల్యోపనిషత్ సమష్టి పారాయణ జరుగుతూంది. ఉదయం పదిన్నర గంటల నుండి లలితాసహస్ర నామ స్తోత్రం, విష్ణుసహస్రనామస్తోత్ర పారాయణం జరుగుతూన్నవి. సాయంకాలం 4 గం॥ల నుండి 5 గంటల వరకు శ్రీమద్భాగవత ప్రవచన పూజ్యశ్రీ సర్వాత్మానంద స్వాములవారు చేస్తున్నారు. రాత్రులు 6 1/2 గంటల నుండి 7 1/2 గంటల వరకు భజన, నామసంకీర్తనలు జరుగుతూన్నవి.

(02). 3-09-2020 శ్రావణ పౌర్ణమి సోమవారం అధిష్ఠాన మందిరంలో గురుపాదుకల పూజ జరిగినది. 5-09-2020 బుధవారం అయోధ్య రామమందిర నిర్మాణ శంఖుస్థాపన సందర్భంగా రామ మందిర నిర్మాణం అపూర్వంగా, నిర్విఘ్నంగా జరగాలని శ్రీరామచంద్రుని ఆశీస్సులు కోరుతూ, ఆశ్రమంలో పరివార సహిత శ్రీరామచంద్ర ప్రభువుకు షోడశోపచార పూజ జరిగినది.

(03). 23-07-2020 తేదీన గురువారం ఆశ్రమంలో ఆశ్రమ పరిపాలనా సంఘ సమావేశం జరిగినది. 14-08-2020 తేది శుక్రవారం త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు బోర్డు సమావేశం జరిగినది.

(04). 11-08-2020 తేది మంగళవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆశ్రమంలో శ్రీకృష్ణ పరమాత్మకు షోడశోపచార పూర్వక పూజ జరిగినది.

(05). 22-08-2020 తేది శనివారం వినాయక చవితి సందర్భంగా ఆశ్రమంలో శ్రీసిద్ధిబుద్ధిప్రద వినాయకునికి అర్చన జరిగినది. ప్రసాద వినియోగం చేయబడినది.

(06). 08-09-2020 తేది హృషీకేశ్ శ్రీ శివానందాశ్రమ స్థాపకులు, ఇంటర్నేషనల్ దివ్య జీవన సంఘ స్థాపకులు అగు పరమ పూజ్య శ్రీశివానంద సరస్వతి స్వామిజీ జన్మదినోత్సవము జరుగును.

మాతృదేవోభవ, పితృదేవోభవ

పిల్లలు మంచిపేరు తెచ్చుకోవాలంటే తల్లి బిడ్డను ప్రోత్సహించాలి. వేదము, 'మాతృదేవోభవ, పితృదేవోభవ' అంటూ మాతాపితరులకు అత్యున్నతమైన స్థానమును అందించింది. తల్లి మన దేహమువంటిది, తండ్రి ఆత్మవంటివాడు.

కాబట్టి, తల్లిదండ్రులను మనం గౌరవించాలి. అప్పుడు మనకెంతైనా గౌరవం లభిస్తుంది. తల్లిదండ్రులు సంపాదించిన ధనమును సద్వినియోగం చేయాలి. మన దేహములో ఉన్న ప్రతి రక్తపుచుక్కలోను తల్లిదండ్రుల ప్రేమతత్త్వమే నిండి వున్నది. అయితే, ఎవరికైనా అవసరం వచ్చినప్పుడు మీ రక్తాన్ని కూడా దానం చేయడానికి మీరు సిద్ధంగా వుండాలి.

స్వార్థంకోసం పాటుపడవద్దు. స్వార్థ స్వప్రయోజనములే మానవుణ్ణి హీనుని చేస్తున్నాయి. ఈనాటి పిల్లలు తల్లిదండ్రులు సంపాదించిన ధనాన్ని దుర్వినియోగం చేస్తూ వారికి దుఃఖం కలిగిస్తున్నారు. దురభ్యాసములకు లోనై తమ జీవితాన్నే వ్యర్థం గావించుకుంటున్నారు. ఎట్టి పరిస్థితిలోనూ తల్లిదండ్రులకు దుఃఖం కలిగించకూడదు. సద్గుణములు, సత్ప్రవర్తనలను అలవరచుకొని వారికి మంచిపేరు తెప్పించాలి.

-భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు

Regd.No. TRP / 123 / 2018 - 20 September 2020 Rs.10/- R.No.8139/63
Date of Publication 26-08-2020, Permitted to post : 29th, 30th every month.

ఆశ్రమంలో యోగాభ్యాసము

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం